# పోతురాయి గుడి

మా పెళ్ళి ఉన్నంతలో వైభవంగానే చేశాడు సరస్వతీ వాళ్ల నాన్న. పల్లెటూరు పిల్లే అయినా డిగ్రీ వరకూ చదివి తెలివి తేటలున్నదే మా సరస్వతి. చూడ్డానికి లక్ష్మీదేవే - (కట్నం కూడా తెచ్చింది). పెళ్లి తంతులో ఎంత శ్రద్ధాభక్తుల్తో పాల్గొందో-నాకు చిరాకేసేది పురోహితుడు తీయిస్తున్న గుంజీలకీ- చేయిస్తున్న కసరత్తులకీ- కానీ... పెద్దవాళ్ల సాంప్రదాయం కాదని హటం చేస్తే... వీడో ఎడ్డెమంటే తెడ్డెమనే రెట్టమతంగాడను కుంటారని సరస్వతిని కాపీ కొట్టేశాను. ఇంకీ పిచ్చాళ్లు మమ్మల్ని రాత్రి గదిలోకి పంపేక మా జీవితాల్లో ఎంటరవరులే... అనుకుని నవ్వు నటిస్తూ అందర్నీ సంతోష పెట్టాను. మా అమ్మా నాన్నా అయితే పెళ్లి పీటల మీద నా అవస్థలు చూసి 'తిక్క కుదిరింది సన్నాసికి...' అని నవ్వుకోవటం నేను గమనిస్తూనే వున్నాను.

పట్టపగలు మమ్మల్ని కలిపి కట్టి పెళ్లి మండపం నుంచి అరుంధతీ నక్షత్రం చూడమని ఆకాశం కేసి చూపించారు. నక్షత్రం కాదు గానీ మిట్ట మధ్యాహ్నం సూరీడు కిసుక్కున కంట్లో పొడిచాడో కిరణంతో. సరస్వతి మాత్రం సభక్తిగా కనపడని నక్షత్రాన్ని ఊహించుకుని దణ్ణం పెట్టేసింది- ఏంటో చాదస్తాలు నవ్వాపుకున్నాను.

ఇంకొంచెంసేపు కసరత్తులూ.... గుంజీలూ... అయ్యాయి.

అన్నాలెట్టారు.

పొద్దున్నే లేపారేమో... పెళ్లి భోజనం అవగానే ఆవలింతలు నిద్ర పోవాలని ఇండికేషనిచ్చాయి. సర్లే రాత్రి... నిద్దరుండదుగా... కాసేపు పడుకోవడమే బెటరని... బెటరేంటి- బెస్టనీ... రెస్టుకి విడిది ఇంటికి చేరాను. లక్కీగా సరస్వతి కూడా వచ్చింది- గానీ... ఆడంగుల మధ్య ఆవిడ పడక. 'అలాగే కానీ... ఇంకెన్ని గంటల్లే' అనుకుంటూ కలల్లోకి వెళ్లిపోయాను-

చీకటి పడుతుంటే, మేళ తాళాలు మోగాయి. మళ్లీ ఏంట్రా చప్పుళ్లూ... అనుకుంటూ నిద్ర లేచాను. ఆడపెళ్లివారి తరపునుంచి ముగ్గురు ముసలి ముత్తయిదువులొచ్చారు.

ఈ వూరువాళ్ల ఆచార ప్రకారం... పెళ్లయిననాటి రాత్రి కొత్త దంపతులు 'పోతురాయి గుడి'కెళ్లి దర్శనం చేసుకురావాల్ట.

పోలాలమ్మ, పోతురాజుల గుడి గురించి విన్నాను- ఈ 'పోతు రాయి' ఏమిటో-

వచ్చినవాళ్లు ఎవరో? వీళ్లతో కల్సిన బంధుత్వం ఏమిటో కూడా నాకింకా పూర్తిగా తెలియదు. "అలాగేనండి" తలూపాను ఎక్కువ మాటలు పొడిగించటం దేనికని, రడీ అయిపోయాను.

✦ ✦ ✦

కాస్సేపట్లో పట్టుచీర్లో మెరిసిపోతున్న సరస్వతితో రిక్షా ఎక్కి పోతురాయి గుడి కెళ్లాను. మా తర్వాత... రిక్షాల్లోనూ, నడిచీ ఆడంగులంతా గుడికొచ్చారు- నేనొక్కణ్నే మగాణ్ని.

ప్రదక్షిణలూ పాటలతో చాలాసేపు ఆ పూజ తంతు నడిచింది. హారతులిచ్చారు. పసుపూ కుంకం పూలూ ఆ రాయికి ఇచ్చినట్టే ఇచ్చి అన్నీ కళ్లకద్దుకుని కొంగులో ముడేసుకుని పూలు జడలో తురుముకుని వచ్చారు. అక్కడే సరస్వతిని నా కాళ్లకి మొక్కించి అక్షంతలు వేయమన్నారు. వేశాను.

పోతురాయికి ఏ ఆకారం లేదు... ఓ పెద్ద బండ్రాయి. నలు పలకలగా ఉంది... కానీ ఈ విశ్వాసం చూస్తే ఆశ్చర్యమేసింది... సరస్వతి ఆ రూపం లేని రాయికి అంత భక్తి ప్రపత్తుల్తో మొక్కటం చూస్తే ఈ సంప్రదాయాలూ ఆచారాలూ ఎన్నేళ్లైనా ఇలా ఉంటాయి అని నమ్మకం కలిగింది.

రెండు గంటలు నడిచాక మళ్లీ రిక్షాలెక్కాం- గుళ్లోంచి ఇంటి వరకూ చేరే వరకూ సరస్వతి నా చెయ్యి వదలకుండా పట్టుకునే ఉండాల్ట!

ఇదేదో మంచి ఆచారమేలే.... మా చేతులు బోల్డు ఊసులు ఆడుకున్నాయి. రిక్షాలో సరస్వతిని అడిగాను. ఏంటి ఈ పోతు 'రాయి' కథ అని?

సరస్వతి తను విన్న చరిత్ర నాకు చెప్పింది.

✦ ✦ ✦

ఐదు తరాల క్రితం అంటే సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం ఈ పోతురాయి పూజ మొదలైంది. ముఖ్యంగా ఆ ప్రదేశంలో పెళ్లైన దంపతులు తొలిరోజే పోతురాయి గుడికి వెళ్లి దర్శించుకోవటం ఆనవాయితీ అయిందిట.

ఈ ప్రదేశం అంతా ఒకప్పుడు చెలమయ్య నాయుడుగారి జమీన్‌లో వుండేది. ఇల్లు కట్టుకుని వుంటున్నందుకూ పొలం దున్నుకుని

తింటున్నందుకూ ఆ ప్రాంతం జనం ఎంతో కొంత అద్దెకట్టి (కప్పం కట్టి) దేశాన్ని సుభిక్షంగా ఉంచేవారు. చెలమయ్య నాయుడుగారు కూడా ప్రజల్ని బాధ పెట్టక వారి కష్టసుఖాల మేరకే పన్నులు వసూలు చేస్తూ అందరి మెప్పులూ పొందేవార్ట! ఆయన వైభవోపేతమైన జీవితానికి మరింత హుందాతనం తెచ్చేది... ఆయనగారి కళాప్రియత్వం... సంగీత సాహిత్య నృత్య కళా ప్రదర్శనల్తో ప్రజలందర్నీ ఉల్లాసభరితుల్ని చేస్తుండేవారుట చెలమయ్యగారు.

ఓసారి దేవుడి కల్యాణం అప్పుడు శ్రీకాకుళం నుంచి శృంగారమణి అనే నర్తకీమణి నృత్యాన్ని ఏర్పాటు చేసారు జమిందారుగారు.

ఒక్కరోజు ప్రదర్శనకని పిలిచిన ఆమె కళ్యాణం జరిగిన ఐదు రాత్రులూ తన నాట్య ప్రదర్శనతో జనాల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.

చెలమయ్యగారికి మరీ మంత్రం పెట్టేసింది. అందరూ ముక్కున వేలేసుకుని చూస్తుండగా జమిందారి తోట బంగళాలో మకాం పెట్టేసింది. మచ్చలేని చందమామలాంటి ఆయన జీవితానికి గ్రహణం పట్టేసింది అనుకున్నారంతా.

రోజూ సాయంత్రం గుర్రబ్బగ్గీలో చెలమయ్యగారు తోట బంగ్లాకెళ్లేవారు.

కొన్నాళ్లు పోయాక చెలమయ్యగారు అప్పుడప్పుడు ఇంటికెళ్లేవారు.

ఇంకొన్నాళ్లు గడిచాక గుర్రబ్బగ్గీ నడిపే పోతురాజు ఇంటికొచ్చి అమ్మగార్నడిగి డబ్బూ దస్కం పట్టుకెళ్లేవాడు.

అమ్మగారు ఓ రోజు పోతురాజు ముందు కట్టలు తెగి విలపించింది. ఎలాగైనా దాని పీడ వదిలించరా అంది.

పోతురాజు మనసులో కోరికే ఆవిడ కోరినట్లైంది.

ఏం చేసాడో... ఎలా చేశాడో... తెలీదుగానీ... ఆ రాత్రే తోట బంగ్లాలో శృంగారమణి పాము కరిచి చనిపోయింది.

నిండు ప్రాణం విలవిల్లాడిపోతూ చనిపోతుంటే- పోతురాజు పిచ్చాడైపోయాడు. చాలా రోజులు 'పాము... పాము' అని అరుస్తూ... 'నేనే పాము' అంటూ... ఓ రోజు 'ఆ పలకల బండరాయి కింద పోతు పాము ఉంది రండి చూపిస్తాను' అని అందర్నీ పిలిచాడుట- అందరూ... పిచ్చోడి మాటల్లా కొట్టిపడేశారు గానీ చెలమయ్యగారి భార్యకి మాత్రం ఏదో భయం- ఏదో జాలి... ఏదో కృతజ్ఞత... అక్కడికి చూడ్డానికి పరివారంతో వెళ్లింది.

పలకల బండరాయి కింద చచ్చిపడి ఉన్నాడు పోతురాజు. ఆ రాయికి దణ్ణంపెట్టి ఆ ప్రదేశంలో చెలమయ్యగార్ని ఒప్పించి చిన్న మండపం కట్టించిందావిడ. జమిందారుగారూ, భార్యా అంత భక్తిగా గుడి కడితే సామాన్యులు మొక్కకుండా ఉంటారా? ఆనాటి నుంచీ తరతరాలు ఆ 'పోతురాయి'కి మొక్కుతున్నారు... మొక్కినవాళ్లు వరాలు పొందుతున్నారు...

✦ ✦ ✦

కథ బాగోలేదు. ఈ సెంటిమెంటల్ మొక్కులూ అస్సలు బాగాలేవు అనుకున్నా.

"పోతురాయికి మొక్కితే భర్త పరాయి స్త్రీల జోలికి వెళ్లడు తెల్సా? ఎప్పటికీ భార్య చెయ్యి విడవడుట" అంది సరస్వతి నమ్మకంగా- నా చెయ్యి ఇంకా గట్టిగా నొక్కి పట్టుకుంది. నాకూ ఆ చెయ్యి విడవాలని లేదు... నేనూ ఇంకా గట్టిగా పట్టుకున్నాను... చిరునవ్వు నొక్కి పెడుతూ.

